రూ.1.08 కోట్లతో ఉపఖజానా భవన నిర్మాణం

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో రూ.1.08 కోట్ల వ్యయంతో ఉపఖజానా భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఉపఖజానా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా డిప్యూటీ డైరెక్టర్ డీ గంగాధర్, కోవూరు ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్, ఎస్‌డబ్ల్యూడీఐసీ ఈఈ శ్యాంసన్, ఏఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ రామాంజనేయులు, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పడుగుపాడు సహకార సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, డీఏ ల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.


ఉపఖజానా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

పోలింగ్‌బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

• జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కోవూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కోవూరు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తహసీల్దార్లకు సూచించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల తహసీల్దార్లతో మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన ఎన్నికల నియమావళిపై తహసీల్దార్లు పూర్తిగా అవగాహన కలిగిఉండాలన్నారు. మండలాల్లోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి, కోవూరు ఆర్వో, తెలుగుగంగ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ వెంకటరమణబాబు, తహసీల్దార్లు విజయశ్రీ, సురేష్‌బాబు, శైలేంద్రకుమార్, డీటీలు భానుప్రకాష్, ఎస్కే బషీర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షుద్ర పూజల కలకలం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని దామరమడుగు పల్లిపాళెం సమీపంలోని పెన్నానదిలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారు. ముగ్గుతో బొమ్మగీసి పూజలు చేసిన ఆనవాళ్లను చూసి స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రతినెలా అమావాస్య రోజున గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారని స్థానికులు తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయని చెప్పారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి క్షుద్ర పూజలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డయల్ యువర్ డీఎంకు రెండు ఫిర్యాదులు

నెల్లూరు సిటీ: నగరంలోని నెల్లూరు – 1, 2వ డిపోల్లో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

➡ నెల్లూరు నుంచి పామూరుకు సంగం బైపాస్ మీదుగా ఎక్స్‌ప్రెస్ బస్సును నడపాలని వింజమూరుకు చెందిన హజరత్ కోరారు. అయితే కొన్ని కారణాల రీత్యా ఎక్స్‌ప్రెస్ బస్సును నడపలేమని ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు.

➡ ముత్తుకూరు మండలం పోలంరాజుగుంటకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని అదే ప్రాంతానికి హరనాథరెడ్డి కోరారు. దీనిపై పరిశీలిస్తామని రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ పేర్కొన్నారు.

రేపట్నుంచి తహసీల్దార్లకు శిక్షణ

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తహసీల్దార్లకు శిక్షణ కార్యక్రమాలను విజయవాడలో నిర్వహించనున్నారని కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో ఈ నెల 12 నుంచి 16 వరకు, రెండో విడతలో 19 నుంచి 23 వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి తన ఇంట్లో మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సుజాతమ్మ కాలనీలో నాగభూషణం (48) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన బయటకు రాకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు పక్కింటి వారు తెలియజేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతి



నెల్లూరు సిటీ: ట్రాక్టర్ ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చింతారెడ్డిపాళేనికి చెందిన కిశోర్‌బాబు, సౌభాగ్య రెండో కుమారుడు యువకిశోర్ (18) బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. తండ్రి బైక్ తీసుకొని నవాబుపేటలోని స్నేహితుడి ఇంటికి మధ్యాహ్నం బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై చింతారెడ్డిపాళెం నుంచి ఎన్టీఆర్‌నగర్ వైపు వెళ్లే దారిలో ఇసుక ట్రాక్టర్ వేగంగా ఢీకొంది. అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడి గాయపడిన యువకిశోర్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ జోన్ - 1 అసిస్టెంట్ గవర్నర్‌గా శేఖర్‌రెడ్డి



నెల్లూరు(బృందావనం): రోటరీ సింహపురి జోన్ – 1 అసిస్టెంట్ గవర్నర్‌గా కొండా శేఖర్‌రెడ్డిని రోటరీ 3160 గవర్నర్ సాధు గోపాలకృష్ణ నియమించారు. దీనికి సంబంధించిన వివరాలను శేఖర్‌రెడ్డి తెలియజేశారు. గోవాలో రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అసిస్టెంట్ గవర్నర్స్ సెమినార్‌లో ఈ మేరకు తనను నియమించారని చెప్పారు.

25న వనభోజనాలు

నెల్లూరు(మినీబైపాస్): వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వనభోజనాలను ఈ నెల 25న నిర్వహించనున్నామని జంగమ సేవా సంఘ అధ్యక్షుడు గంధవళ్ల దశరథరామయ్య పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. పరమేశ్వరుడికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనను నిర్వహించనున్నామని వివరించారు. జంగమ సంఘీయులు తరలిరావాలని కోరారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

పొదలకూరు : కుష్టు వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకుంటే గ్రామాల్లో ఆ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం మోహన్‌రావు అన్నారు. స్థానిక ఎస్వీబీవీడీ కళాశాలలోని విద్యార్థులకు కుష్టు వ్యాధిపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా స్పర్శ లేని పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు కలిగిఉంటే వైద్యారోగ్య సిబ్బందికి సమాచారం అందజేయాలని కోరారు. కుష్టును ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మందుల ద్వారా నయం చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, ఆరోగ్యసహాయకులు రాధాకుమారి, కృష్ణమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోహన్‌రావు

ఆర్బీకేల ద్వారా రైతులకు పురుగు మందులు

కొడవలూరు: ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన పురుగు మందులు అందిస్తున్నట్లు ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ వారి మన గ్రోమోర్ ద్వారా పురుగు మందులను ఆర్బీకేల్లో పొందవచ్చని చెప్పారు. పురుగు మందులు అవసరమైన రైతులు సంబంధిత ఆర్బీకేలోని వీఏఏను సంప్రదించి ఇండెంట్ నమోదు చేసుకుంటే మరుసటి రోజునే అందజేస్తామని చెప్పారు. మండలంలోని అన్ని ఆర్బీకేలకు నార్తు రాజుపాళెంలోని మన గ్రోమోర్ నుంచి పురుగు మందులు సరఫరా చేస్తామన్నారు. మండలంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని దామరమడుగులో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు వేయాలన్నారు. పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి, నాయకులు ప్రదీప్, పెద్దఅల్లాభక్షు, చిన్నఅల్లాభక్షు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధమహోత్సవం

సోమశిల: అనంతసాగరంలోని శ్రీహజరత్ సయ్యద్‌షా యూసఫ్ ఆలీషా ఖాదరి 42వ గంధ మహోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి సొందల్‌మాలితో ప్రారంభమైన గంధమహోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఫకీర్ల విన్యాస్యాలు డప్పు వాయిద్యాల నడుమ గంధ కలశాన్ని సజ్జదా ఇంటి వద్ద నుంచి ఆలీషా ఖాదరి దర్గాకు తీసుకొచ్చారు. గంధాన్ని సమాధులకు లేపనం చేసి భక్తులకు పంచి పట్టారు. శనివారం రాత్రి ఖవ్వాలి నిర్వహించారు.

ఎంపీటీసీ సభ్యుడికి పుత్ర వియోగం

పొదలకూరు : మండలంలోని కనుపర్తి ఎంపీటీసీ సభ్యుడు, పొదలకూరు నిమ్మమార్కెట్ యార్డు వ్యాపారి మెంతెం బాలకృష్ణారెడ్డికి పుత్ర వియోగం కలిగింది. ఆయన కుమారుడు వెంకటేశ్వరరెడ్డి బెంగళూరులో రైలు ప్రమాదంలో మృతి చెందగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలకు హాజరై వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట యార్డు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేలటూరు శ్రీనివాసులురెడ్డి, అట్లా ప్రభాకర్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.


వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం

కోవూరు: మాఘమాసం సందర్భంగా స్థానిక గాంధీ పార్కుసెంటర్‌లోని కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు పెద్ద సంఖ్యలో హాజరై వ్రతాన్ని ఆచరించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీకాంతాచార్యులు సత్యనారాయణస్వామి వ్రత విశిష్టతను వివరించారు. అనంతరం వ్రతంలో పాల్గొన్న దంపతులను శాలువాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, రుత్వికులు జయప్రకాష్‌స్వామి, రాఘవాచార్యులు, నాగరాజుస్వామి, శేఖర్‌స్వామి పాల్గొన్నారు.


వ్రత పూజలు చేస్తున్న అర్చకులు


సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరిస్తున్న దంపతులు

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

వెంకటాచలం: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ వైద్యురాలు తనూజ అన్నారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఏ–3 పరీక్షల్లో ప్రతిభకనబర్చిన నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఆమె తన సొంత నగదుతో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రాథమిక విద్య నుంచే క్రమశిక్షణతో చదవాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం నిడిగుంటపాళెం బాలికల వసతిగృహ విద్యార్థినులకు ప్రత్యేక తరగతుల కోసం రూ.7 వేలు నగదును హెచ్ఎం చలపతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ తనూజ

అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృతి

• పోస్టుమార్టంలో తేలని వ్యాధి
• వైరాలజీ ల్యాబ్‌కు కోళ్ల నమూనాలు
• నివేదిక అందాక వ్యాధిని వెల్లడిస్తాం: వెటర్నరీ డాక్టర్ మురళీకృష్ణారెడ్డి

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం, చాటగొట్ల గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లోని కోళ్లు వారం రోజులుగా అంతుచిక్కని వ్యాధితో పెద్ద సంఖ్యలో మృతి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో తాటిపర్తి పశువైద్యాధికారి సీ మురళీకృష్ణారెడ్డి కోళ్ల ఫారాలను సందర్శించి మృతి చెందిన కోళ్లను పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిస్థితి పొదలకూరు మండలంలోనే కాక జిల్లా వ్యాప్తంగా ఉందన్నారు. పోస్టుమార్టంలో కోళ్లు ఏ వ్యాధితో చనిపోతున్నాయో నిర్ధారణ కాలేదన్నారు. బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృతి చెందుతున్నాయని స్పష్టంగా చెప్పలేమన్నారు. విజయవాడకు చెందిన వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలు వచ్చి నమూనాలు సేకరించారని తెలిపారు. వీబీఆర్ఐ జేడీ సైతం వచ్చి నమూనాలను సేకరించడం జరిగిందన్నారు. భోపాల్‌లోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌కు నమూనాలను పంపారని, త్వరలోనే నివేదికలు అందే అవకాశం ఉందన్నారు. వైరాలజీ నుంచి నివేదికలు అందకుండా తాము వ్యాధి నిర్ధారణ చేయలేమన్నారు.

నేడు ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవం


ప్రారంభానికి సిద్ధమైన నూతన భవనం


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

మనుబోలు: అక్కంపేటలోని ఎన్ఎస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించనున్నట్లు మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం అక్కంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం క్రమబద్ధీకరణలో భాగంగా అక్కంపేట ప్రాథమికోన్నత పాఠశాలను మూతవేసేందుకు యత్నించగా కోర్టును ఆశ్రయించి కాపాడుకున్నామని తెలిపారు. తన సొంత నిధులతో విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలు కల్పించి క్రమంగా వారి సంఖ్య పెరిగేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆ తరువాత స్థానిక ఎమ్మెల్యే కాకాణి సహకారంతో ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేయించుకున్నామని తెలిపారు. ఉన్నత పాఠశాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చేందుకు రూ.25 లక్షలు వెచ్చించి బస్సు సౌకర్యం కల్పించామని చెప్పారు. ప్రభుత్వం మనబడి నాడు–నేడు ఫేజ్–2లో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతన భవనం కోసం రూ.1.75 కోట్లు కేటాయించిందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తాను చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త భవనానికి తన తండ్రి నారపరెడ్డి సీతారామిరెడ్డి(ఎన్ఎస్సార్) పేరు పెట్టేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పాఠశాల భవన ప్రారంభోత్సవానికి అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కిరణ్ సేవలను గ్రామస్తులు కొనియాడారు. ఈ సమావేశంలో విద్యా కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసులురెడ్డి, పెనుమల్లి రామకృష్ణారెడ్డి, శేషారెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం రేపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ, రూరల్ మండల కన్వీనర్లు మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా సమీపంలోని వీజీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొడవలూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

సీహెచ్‌సీ..సరికొత్తగా..



సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తోంది. వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు అత్యాధునిక వైద్యపరికరాలను సమకూర్చి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడుతోంది.

• నాడు–నేడుతో మారిన రూపు రేఖలు
• రూ.3.15 కోట్లతో నూతన భవన నిర్మాణం
• అందుబాటులోకి అత్యాధునిక వైద్యసేవలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలు, సమీప మండలాల నుంచి రోగులు నిత్యం వస్తుంటారు. ప్రతిరోజూ 500వరకు ఓపీ ఉంటుంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందుతుండడంతో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల వైపే మొగ్గు చూపుతున్నారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

రూ.3.5 కోట్లతో నూతన భవన నిర్మాణం

నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని రూ.3.15 కోట్లతో నిర్మించారు. 30 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ భవనాన్ని గత నెలలో కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ భవనంలో అన్ని విభాగాలకు వేర్వేరు గదులు నిర్మించారు. స్త్రీలు, పురుషుల వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఐసోలేషన్ గదులు, ల్యాబ్‌లను ప్రత్యేకంగా నిర్మించారు. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు సీఎస్సార్ నిధుల నుంచి మరో రూ.25 లక్షలు మంజూరు చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ నిధులు మంజూరైతే సీహెచ్‌సీలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుంటుంది.

పేదల వైద్యానికి పెద్దపీట



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తోంది. పేద ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లలేరు. వీరిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆస్పత్రులనే కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతోంది. సీహెచ్‌సీని అభివృద్ధిలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారం మరువలేనిది.

– సీహెచ్ సతీష్‌రెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు

ప్రభుత్వ సహకారం బాగుంది



సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ సహకారం బాగుంది. నిధులు విడుదల చేయడం, ఆ వెంటనే నిర్మాణం చేపట్టడం చకచకా జరిగిపోయాయి. పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది.

– డాక్టర్ పద్మజ, సీహెచ్‌సీ వైద్యాధికారి


రోగుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లు


అధునాతన వైద్య పరికరాలు